
బాంబేనుంచి టోక్యో మీదుగా శాన్‌ఫ్రాన్సిస్కోకి వెళ్లే విమానంలోని నా సీటులో కూర్చున్నాక నాకు ఎగిరి గంతులేయాలనిపించింది. చిట్టచివరికి నా శ్రమ ఫలించింది. నా పాస్‌పోర్ట్‌లో అమెరికన్ హెచ్‌వన్ వీసాముద్ర ఉంది.



# వన్ ఎక్స్‌ట్రా బెడ్‌రూం

మల్లాది వెంకట కృష్ణమూర్తి

చాలామంది మధ్యతరగతి భారతీయ తల్లిదండ్రుల బంగారు కల తమ పిల్లలు అమెరికా వెళ్లి సెటిల్ అవడం. మా తల్లిదండ్రుల కల కూడా అదే. మా నాన్నగారు పి.ఎఫ్.లోన్ తీసుకున్నారో, సెలవురోజుల్లో ఎకౌంట్స్ రాసి సంపాదించారో, బల్లకింద చేతులుంచే ఉద్యోగం కాదు కాబట్టి ఏం చేశారో తెలియదు కానీ, నన్ను ఇంజనీరింగ్‌లో చేర్పించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ డిగ్రీ నా చేతిలో పడ్డాక నాకన్నా మా నాన్నగారు ఎక్కువ పొంగిపోయారు. మా అమ్మ పెదకాకాని వెళ్లి అక్కడ నాగమల్లేశ్వరుడికి అభిషేకం చేయించింది. నా అన్నప్రాసన కూడా పెదకాకానిలోనే జరిగిందట. మా ఇలవేల్పు ఆయన.

నా అందమైన భవిష్యత్‌లోకి మా విమానం బయలుదేరింది.

000

సాహసవంతుల దేశం, అవకాశాల దేశం అయిన అమెరికాలో నేను ఉద్యోగంలో చేరిన మొదటిరోజు గుంటూరులోని మా పక్కింటికి ఫోన్ చేసి, అమ్మా, నాన్నలతో మాట్లాడాను. మా అమ్మ అప్పటికే నా మీద దిగులుపడింది.

ఓ అయిదేళ్లు కష్టపడి సంపాదించి ఆ డబ్బుతో తిరిగి ఇండియా వస్తానని, ఆ డబ్బుతో వ్యాపారం చేసుకుంటూ హాయిగా బతకచ్చనీ చెప్పాను. మా నాన్న కూడా నా అభిప్రాయానికి సంతోషించారు.

ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసే మా నాన్నగారు తను సంపాదించినదంతా నన్ను అమెరికాకి తరలించడానికి ఖర్చు చేసేశారు. ఆయన ఒకే ఒక్క కోరిక విద్యానగర్‌లోనో, లక్ష్మీపురంలోనో ఓ చక్కటి సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ కొనుక్కుని శేషజీవితం హాయిగా వెళ్లదీయాలని.

నా గురించి మా నాన్నగారు చేసిన త్యాగాలు నాకు తెలుసు. స్కూటర్‌కైతే పెట్రోల్ ఖర్చు అని సైకిల్ వాడేవారు. ఆకు కూరలు పెరట్లో పండించేవారు. మా అమ్మకి మల్లెపూలు తెచ్చే ఖర్చుతో ఓ మామిడికాయ తెస్తే పచ్చడి చేసుకోవచ్చనుకునేవారు. ఈ చిరుత్యాగాలన్నీ నా మనసులో ఇంకిపోవడంతో, నేనాయనకి ఆయన కోరుకున్నదానికన్నా ఎక్కువ అందించాలనుకున్నాను.

నాకు క్రమంగా అమ్మా, నాన్నల మీద దిగులేర్పడసాగింది. అంతర్జాతీయ చీప్ ఫోన్‌కార్డ్‌లు కొని వాటితో తరచూ మా వాళ్లతో మాట్లాడేవాడిని. ఆఫీసు - స్టూడియో (బ్రహ్మచారులుండే సింగిల్ రూమ్ ఫ్లాట్), స్టూడియో - ఆఫీస్ ... మిగిలిన వాళ్లలా ఏడాది గడిచాక - ఓర్లెండోలోని డిస్నీలాండ్‌కి వెళ్లలేదు. డబ్బు కూడబెట్టడం నాకు మా నాన్న నుంచి అనువంశికంగా వచ్చినట్లుందనుకుని నవ్వుకునేవాడిని. అమెరికాలో కారు, కంప్యూటర్, క్రెడిట్ కార్డులు, (త్రిబుల్ 'సి'లు) లేనివాణ్ణి బహుశా నే నొక్కడినేనేమో!

000

నేను అమెరికా చేరుకున్న రెండో ఏడు మధ్యలో ఇండియా రూపాయిని డివాల్యూ చేసింది. దాంతో నా బ్యాంక్ అకౌంట్‌లోని అమెరికన్ డాలర్స్‌ని, కొత్త మారకవిలువలతో కాలిక్యులేటర్ మీద లెక్క వేసి చూసి ఆనందపడ్డాను.

మా అమ్మ నా పెళ్లికి ఒకటే తొందరపడసాగింది. పెళ్లయినా ఆర్థికంగా ఫర్వాలేదన్న ధైర్యం వచ్చాక సరేనన్నాను.

నాకు పది రోజులకి మించి సెలవు దొరకదు. ఓ రోజు అటు, ఓ రోజు ఇటు ప్రయాణానికి, ఇంక మిగిలింది ఎనిమిది రోజులే. ఆ విషయం మా అమ్మకి స్పష్టంగా చెప్పాను. 'ఆ ఎనిమిది రోజుల్లోనే జరగాల్సినవన్నీ జరిగిపోవాలని' హెచ్చరించాను.

అతి చవకైన సర్వీస్ నందించే రుమేనియన్ ఎయిర్‌వేస్ విమానంలో నా సీట్‌ని రెండు నెలలముందు బుక్ చేసుకున్నాను. బంధుమిత్రులకి చిన్న చిన్న బహుమతులు కొనడంలాంటి షాపింగ్


## ప్రగతి పథంలో తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ

### సాధించిన ప్రగతి

- రూ. 207 లక్షల వ్యయంతో ఆధునిక వసతులతో అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం.
- శేషాచలం హిల్‌వ్యూ ఎక్స్‌టెన్షన్ లే ఔట్‌లో రూ.110 లక్షల వ్యయంతో సైట్ అండ్ సర్వీసెస్ స్కీము క్రింద 1168 ప్లాట్లు విక్రయము జరిగినది.
- రూ. 29 లక్షల వ్యయంతో 5 పార్కులు, 3 శ్మశాన వాటికలను సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేయడం జరిగినది.
- రూ. 80 లక్షల ఖర్చుతో రాయలచెరువు రోడ్డు, బైరాగి పట్టెడ, నరశింహతీర్థం రోడ్డులలో 3 షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించడం జరిగింది.
- రూ.30 లక్షల వ్యయంతో అన్నమయ్య మార్గంలో 2 కిలో మీటర్ల వరకు వర్షపు నీటి కాలువల నిర్మాణం.
- తిరుపతి పట్టణమును అందముగా తీర్చిదిద్దడానికి రూ. 9 లక్షల వ్యయంతో ఆర్.టి.సి.బస్టాండు వద్ద, రాయల్ చెరువు రోడ్డు వద్ద 1 1/2 కిలోమీటర్ల వరకు ఫుట్‌పాత్‌లు, రోడ్డు డివైడర్‌లువేయడం జరిగినది.

### చేపట్టబోయే కార్యక్రమములు

- వేదాంతపురము వద్ద 25 ఎకరాల విస్తీర్ణములో ఒక కోటి రూపాయల విలువ గల అభివృద్ధి కార్యక్రమాలతో సైట్స్ మరియు సర్వీసు పథకము క్రింద 471 ప్లాట్లను అభివృద్ధి పరచి వేలము ద్వారా విక్రయము జరుగుతుంది.
- రూ.25 లక్షల ఖర్చుతో జీవకోన కాలనీలలో క్రొత్తగా రోడ్ల నిర్మాణం చే పట్టడానికి చర్యలు. ముత్యాల రెడ్డి పల్లిలో రూ.9 లక్షల ఖర్చుతో రోడ్డు, కాలువల నిర్మాణం, ఎస్.సి, ఎస్.టి. నివాస ప్రాంతాలలో నిర్మాణం జరుగుతున్నది.
- 60 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం 1 1/2 కిలోమీటర్ల మేరకు బైపాస్ రోడ్డును, రేణిగుంట రోడ్డును కలపటానికి పనులు చేపట్టబడబోవుచున్నది.
- తిరుపతి పట్టణ ప్రాంతాన్ని సుందరంగా తయారు చేయడానికి, మొక్కలు నాటు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేయడానికి చర్యలు.
- రూ. 30 లక్షల ఖర్చుతో డే అండ్ నైట్ క్రాఫ్టు బజారు టూరిజం మాస్టర్ ప్లాన్ ప్రకారం నిర్మాణం చేయడము.

యమ్. సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు

NAG 99

కార్యక్రమాలు స్తబ్దుగా ఉన్న నా జీవితంలో పెద్ద ఆనందాలయ్యాయి.

000

మా అమ్మా నాన్నలు ముందే నా కోసం చాలా సంబంధాలు చూశారు. పదిమంది అమ్మాయిల ఫొటోలను చూపించారు. వారి రూప గుణ విశేషాలనూ, దోషాలను వివరించింది అమ్మ. వాళ్లందర్నీ చూడటంతో నాలుగు రోజులు గడిచిపోయాయి. ఇంక సరిగ్గా నాలుగు రోజుల్లో పెళ్లి కావాల్సి ఉంది. ఆ వ్యవధి చాలదని నాకు బాగా నచ్చిన అమ్మాయి తల్లిదండ్రులు చెప్పారు. ఆ వ్యవధికి ఒప్పుకున్న తల్లిదండ్రుల అమ్మాయి నా ఆఖరి చాయిస్. కానీ ఏం చెయ్యను? అమెరికా వెళ్తే మళ్లీ మూడేళ్లకి కానీ రాలేను. అంతకాలం నా వివాహం వాయిదా వేయడం మా అమ్మా నాన్నలకిష్టం లేదు.

నా క్కూడా...

నాకూ పరిమళకి పెదకాకాని గుళ్లో వివాహం అయింది. అయీ అవకుండానే గుంటూరులోని రిజిస్ట్రార్ ఆఫ్ మ్యారేజెస్ ఆఫీసుకి పరిగెత్తాం. పరిమళ నాతో అమెరికా రావాలంటే మా మ్యారేజ్ సర్టిఫికెట్ ముఖ్యం మరి.

పెళ్లయిన రాత్రే మద్రాసుకి బయలుదేరాం. టెన్షన్ ... టెన్షన్! ఆ రోజు మేం కన్సలేట్‌కి వెళ్లలేకపోతే, పరిమళకి డిపెండెంట్ వీసా రాకపోతే నే నొక్కడినే అమెరికా వెళ్లాలి. వ్రతం చెడ్డా ఫలం దక్కదు.

ఉదయం ఆరుంపావుకే కన్సలేట్ పక్కన పేవ్‌మెంట్‌మీద క్యూలో నుంచున్నాం. చిత్రం! పెళ్లయినా మూడు నిద్రలు, శోభనం రాత్రి, హనీమూన్, ఇతర ముచ్చట్లు మాకు జరగలేదు. పరిచయస్తులం కూడా కాదు. ఇద్దరికీ బిడియమే. ఫ్రెండ్స్‌లా బిహేవ్ చేశాం.

పరిమళకి వీసా దొరికింది. ఆ రాత్రే మా మామగారు ఒంటరిగా రైలెక్కితే, మేం జంటగా మద్రాసు నుంచి శాన్‌ఫ్రాన్సిస్కోకి విమానం ఎక్కాం.

000

మొదటి రెండు నెలలు పరిమళ ఎంతో ఉత్సాహంగా ఉంది. ప్రతిదీ వింతే, ప్రతిదీ కొత్తే. అన్నీ ఆకర్షణీయమైన వింతలే, ఆనందించదగ్గ కొత్తలే.

రెండు నెలల తర్వాత తల్లిదండ్రుల మీద దిగులు ఏర్పడసాగింది పరిమళకి. ఆఫీసునించి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఏడ్చిన గుర్తులు పరిమళ చెంపలమీద కనిపించేవి. ఒకోసారి నాకు ఆఫీస్‌కి ఫోన్ చేసి, ఫోన్‌లో ఏడ్చేది. ఏదైనా ఉద్యోగంలో చేరితే వ్యాపకం ఉంటుందనుకుంటే ఆమెకి వర్క్ పర్మిట్ లేదాయె.

రోజూ తల్లిదండ్రులతో మాట్లాడేది పరిమళ కొత్తల్లో. కానీ ఖర్చులు పెరిగాయి. అది వారానికి మూడుసార్లు నుంచి, రెండుసార్ల నుంచి, ఒక్కసారికి ష్రింక్ అయింది. నా సేవింగ్స్ క్రమంగా తిరుగుముఖం పట్టసాగింది.

నేను మరో ఉద్యోగంలోకి మారాక, మా పెళ్లయిన నాలుగేళ్లకి తిరిగి ఇండియా వెళ్లాం. ఈసారి పదిహేను రోజుల సెలవు. పెదకాకానిని, తిరుపతిని, అత్తగారి ఊరిని దర్శించాం.

నాకు మా నాన్నగారిలో ముసలితనం స్పష్టంగా కనిపించింది. అమ్మ గట్టిగా చెప్పింది "నాకు మనవడిని ఎత్తుకోవాలని ఉందిరా!" అని. అయితే మాకు పిల్లలని కనే ఆర్థిక స్తోమత లేదని ఆమెకు అర్థమయ్యేలా చెప్పలేకపోయాను. ఇండియాలోలాగా కాదు. అమెరికాలో పిల్లలని కనడం డాలర్స్‌తో ముడిపడి ఉంటుంది. తిరిగి అమెరికా వచ్చేటప్పుడు నాన్నగారితో చెప్పాను, త్వరలో ఆయన ముచ్చట తీరుస్తానని, లక్ష్మీపురంలో రెండు బెడ్‌రూమ్‌ల ఫ్లాట్ కొంటానని. మా పక్కింటి వాళ్లకి చెప్పాను నా తల్లిదండ్రులను కాస్త చూస్తూండమని.

మొదటిసారి నేను అమెరికా వెళ్తుంటే మా అమ్మ ఏడ్చినా నాకు ఏడుపు రాలేదు. ఈసారి నిజంగా దుఃఖం వచ్చిందీ నాకు. 'ఇండియాలో ఉండిపోతా!' అనే ఆలోచన కలిగింది. కానీ పరిమళ, నేను చర్చించుకున్నాక అది పిచ్చి పని అనుకున్నాం. ఆర్థిక ప్రతిబంధకం ఓ కారణమైనా, ఇండియాలో ఉద్యోగం ఇంకో ప్రతిబంధకం అనుకున్నాం. భారమైన మనసుతో విమానం ఎక్కాను.

000

తిరిగి వచ్చాక హెచ్చు జీతానికి మళ్లీ ఉద్యోగం మారాను. ఫలితంగా పరిమళ గర్భవతైంది. ఇప్పుడు ఓ పిల్లని పోషించగలమనే సత్తా వచ్చిందన్నమాట. పెదకాకానిలోని నాగమల్లేశ్వరస్వామి మా కులదైవం కాబట్టి, ఆయన పేరే మా అబ్బాయికి పెట్టాం. అమ్మ మా పేర్లతో అభిషేకాలు, అర్చనలూ గట్రా చేయించింది.

నేను ఫోన్ చేసినప్పుడల్లా మా అమ్మా, నాన్నలు మొదటగా చెప్పేది ఒకటే - "ఓసారి రండిరా, మనవడిని ఎత్తుకుని వాడితో ఆడుకోవాలని ఉంది!"

వాడి ఫొటోలు పంపసాగాం. ఇంకో సంతానం కూడా మా నుదుటిమీద రాసి ఉండడంతో కూతురు పుట్టింది. మొదట మనవడిని చూడాలనే కోరికకి, మా తల్లిదండ్రులకి ఇప్పుడు మనవరాలిని చూడాలన్న కోరిక కలిసి రెండూ అధికం అయ్యాయి.

వాళ్లకి అమెరికాకి టిక్కెట్ పంపించాలని అనుకున్నాను, కానీ మేమే ఇండియా వెళ్లాలని పరిమళ గట్టిగా పట్టుపట్టింది. అందువల్ల ఆమె తల్లిదండ్రులను కూడా చూడవచ్చన్న ఆమె స్వార్థాన్ని నేను తిరస్కరించలేదు.

ఎప్పటిలా ఓ చీప్ ఎయిర్‌లైన్స్‌లో మేం టిక్కట్లు బుక్ చేసుకున్నాం. మా ప్రయాణం ఇంకో వారం ఉందనగా పిడుగులాంటి వార్త వచ్చింది.


మా అమ్మ మరణించింది!

మా అమ్మ తన అనారోగ్యం గురించి తరచు చెప్తూనే ఉంది. కానీ అదిలా పరిణమిస్తుందనుకో లేదు. వృద్ధాప్యంలోని సహజ రోగం అనుకున్నాను.

ఇండియాకు వచ్చే విమానంలో పరిమళతో చర్చించాను. ఇండియాకి వెళ్లిపోయి సెటిల్ అవడం అనే నా కల గురించి. గ్రీన్ కార్డ్ హోల్డర్ అయిన పరిమళ సంపాదన, నా సంపాదనని డాలర్ల నుంచి రూపాయల్లోకి మారిస్తే వచ్చిన మొత్తం ఇండియాలో చస్తే మా ఇద్దరికీ రాదు. పైగా అమెరికాలో గొంతునిండా అప్పుల్లో ఉన్నాం. మేం కొన్న వన్ బెడ్ రూమ్ ఫ్లాట్‌కి నెలనెలా అప్పు చెల్లించాలి. నా కారుకి, పరిమళ కారుకి అప్పు చెల్లించాలి. క్రెడిట్ కార్డు మీద చేసిన అప్పుని నెలనెలా కట్టాలి. ఇంకా ఇతర తనఖాలుండనే ఉన్నాయి.

000

మా నాన్న మనవల్ని కావలించుకుని ఏడుస్తూ చెప్పారు "మీ నానమ్మ ముచ్చట తీరనేలేదురా! మిమ్మల్నిద్దర్నీ చెరో భుజం మీదా ఎక్కించుకుని కాకాని గుళ్లో ప్రదక్షిణలు చేయాలని ఎన్ని కలలు కన్నదో!"



నాకు కళ్లల్లో నీళ్లు తిరిగాయి. "వాట్ ది ఓల్డ్ మేన్ సేస్ డాడ్?" అడిగాడు పెద్దాడు.

"తప్పు!" మందలించాను.

ఆ పూట భోజనం సహించలేదు. అమ్మ ఫొటోని చూస్తూ నిశ్శబ్దంగా కూర్చుండిపోయాను. రెండురోజులున్నాక పరిమళ పుట్టింటికి బయలుదేరాం.

మేం మరికొన్ని రోజులు ఉండలేదన్న అసంతృప్తి మా నాన్న కళ్లలో చూశాక నాకు బాధ రెట్టింపైంది. మర్నాటికి ప్రయాణం వాయిదా వేశాను. మా నాన్నగారికి అన్ని టెస్ట్‌లు చేయించాను. ఉండకూడని రెండూ ఉన్నాయి. బి.పి., షుగర్.

"ఒక్కరే ఇక్కడుండి ఏం చేస్తారు? మీరూ నాతో వచ్చేయండి!" మనస్ఫూర్తిగా ఆహ్వానించానాయన్ని.

"వద్దులేరా, అక్కడ పద్ధతులు వేరుట. నాలాంటి వాళ్లకి టి.వి. ముందు హౌస్ అరెస్ట్ అని విన్నాను. రోజూ రామకృష్ణ మఠానికి వెళ్లకుండా ఉండలేను."

ఆయన మాటల్లో నిజం ఉంది. అమెరికాలోని జీవనవిధానం మా నాన్నగారి చెవిన పడేంతగా ఇక్కడనుంచి అమెరికాకి వలస వెళ్తున్నారు. శనాదివారాలు మేము కారెక్కించుకుంటేనే ఆయన ఇంట్లోంచి బయటకు వచ్చేది.

అత్తగారింట్లో మూడు రోజుల మజిలీ తర్వాత తిరిగి అమెరికాకి ప్రయాణం.

ఫోన్‌లో నాన్నగారు ఫ్లాట్ గురించి చెప్తే కానీ గుర్తు రాలేదు నాకు...

బాంబే ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సహారా నుంచి మా నాన్నకి ఫోన్ చేసినప్పుడు ఆయన మొహమాట పడుతూనే "డబుల్ అక్కర్లేదింక. నా ఒక్కడికి సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ చాలు!" అని అంటే కానీ, నాకు గుర్తు రాలేదు. నాన్నగారి కోరిక తీర్చనేలేదని.

మా ఫామిలీ బడ్జెట్ గొడవల్లో ఆయన ఫ్లాట్ విషయం నా మనసులోంచి దూరం అయింది.

"నేను మర్చిపోలేదు, నాన్నగారూ! డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ చూడండి, డ్రాఫ్ట్ పంపుతాను. ఎప్పటికైనా ఆ ఇంటికి చేరేవాడినేగా!" చెప్పాను.

000

సంవత్సరంన్నర తర్వాత మధ్యాహ్నం మరో ఫోన్ కాల్. గంటక్రితం ఇక్కడ అర్ధరాత్రి నిద్రలో మా నాన్నగారు పోయారట! నేనొక్కడినే వెంటనే విమానం ఎక్కాను. కమ్యూనికేషన్ సరిగ్గా అర్థం చేసుకోక కొంత, మా అమ్మ మరణించినప్పుడు నేను సరైన టైముకి రాకపోవడంవల్ల కొంత; నా తరఫున సరైన నిర్ణయం తీసుకునేవాళ్లు లేనందువల్ల కొంత ...

ఏమైతే నేం ... నేను గుంటూరు చేరుకునేసరికి మా నాన్నగారి అంత్యక్రియలు అయిపోయాయి. అమెరికా వలస వెళ్లడం వల్ల నా జీవితంలో నేను ఎదుర్కొన్న విషాదాల్లో ఇదొకటి అనుకున్నాను.

నాన్నగారి పెట్టెలో నేను రాసిన లెటర్స్ కట్ట కనపడింది. కొత్తల్లో నేను రాసిన ప్రతి ఉత్తరంలో 'ఒక్క బెడ్‌రూమ్ ఏమిటి నాన్నగారూ? రెండు బెడ్‌రూమ్‌ల ఫ్లాట్ కొంటాను' అని రాసిన వాక్యాలు నన్ను వెక్కిరిస్తూ కనిపించాయి. ఒక్క బెడ్‌రూమ్ ఫ్లాట్ కూడా మా నాన్నకి కొనిపెట్టలేకపోయాను. ఇడియట్‌ని! నా ఆదాయంతోపాటు ఖర్చులూ పెరుగుతూండడంతో నా కా వెసులుబాటు దొరకలేదు. అప్పటికప్పుడే ఆ నిర్ణయాన్ని తీసుకున్నాను నేను.

000

మా ఆవిడ నాతోపాటు ఇండియా తిరిగి రావడానికి ఇష్టపడలేదు. నేను రెండేళ్ల తర్వాత తిరిగి వస్తానని పరిమళకి మాట ఇచ్చి ఇండియా వచ్చాను. మా అబ్బాయి బీదర్‌లో ఎం.బి.బి.ఎస్. చదివాక, ఇండియా తనకి పడదని అమెరికాలో సెటిల్ అయ్యాడు. మా అమ్మాయి ఓ అమెరికన్‌ని వివాహం చేసుకుంది. అమెరికాలోనే సంతోషంగా జీవిస్తోంది. తరచూ ఫోన్‌లో నన్ను పలకరించినప్పుడల్లా "అమెరికా వచ్చేయ్, డాడీ!" అంటూంటుంది. వారానికోసారి ఫోన్ చేస్తారిద్దరూ.

అమెరికాలో నేనున్నంతకాలం సంపాదించిన దాంట్లో ఖర్చయింది ఖర్చవగా మిగిలిన సొమ్ముతో గుంటూరు చేరుకున్నాను. మంచి ఫ్లాట్‌కోసం వేట ప్రారంభించాను.

ఇండియాలో రియల్ ఎస్టేట్ ఎంత పెరిగిందో తెలిసి విస్మయం చెందాను. లక్ష్మీపురంలో రెండు బెడ్‌రూమ్‌ల ఫ్లాట్ కొనడానికి, నా నెలసరి మెయిన్‌టెనెన్స్‌కి ఆ సొమ్ము సరిగ్గా సరిపోయింది.

నాతో ఇండియాలో కలిసి జీవించడానికి అంగీకరించని నా ముద్దుల భార్య ఆఖరి ప్రయాణం చేసి దేవుడిదగ్గరకు వెళ్లిందని తెలిసి వలవలా ఏడ్చాను. ఆమె అంత్యక్రియలకు అమెరికా వెళ్లలేదు. హిందూ సంప్రదాయం ప్రకారం అవి చేయాల్సిన హక్కు నా కొడుకుది. అమెరికాలో పెరిగినవాడు "బుల్‌షిట్!" అని ఆ పని చేయలేదని తర్వాత తెలిశాక బాధపడటం తప్ప ఏమీ చేయలేకపోయాను.

మా పిల్లలకి కూడా పెళ్లిళ్లయ్యాక ఖర్చులు పెరిగినట్లున్నాయి. వారానికి ఓ ఫోన్ కాల్ కూడా చేయడంలేదు. నెలకోసారి కాన్ఫరెన్స్ కాల్ చేస్తారు ఇద్దరూ కలిసి.

000

నా మొదటి మనవడు పుట్టాడని తెలియగానే చూడాలన్న తహతహ మొదలైంది. అచ్చం మా అమ్మ పోలికేనని ఫొటోలనుబట్టి తెలుసుకున్నాను. కానీ నా పిల్లలకి ఇండియా నచ్చదు. బాత్‌రూమ్‌లు శుభ్రంగా ఉండవు. మనుషులు మురికి, రోడ్లు మురికి, అమెరికన్స్‌కి ఇండియామీద ఉండే అభ్యంతరాలన్నీ ఉన్నాయి.

కిటికీలోంచి చూస్తూంటే పక్కనే రోడ్డుమీద క్రికెట్ ఆడుతున్న పిల్లలు ఎందరో నాకు కనపడుతూంటారు. ఎంత అదృష్టవంతులు? ఇండియాలో పుట్టినచోట పెరుగుతున్నారు.

నా పిల్లలనుంచి క్రిస్టమస్‌కి, నా పుట్టినరోజుకి గ్రీటింగ్ కార్డులు వస్తూంటాయి. నా మనవల సంతకాలు కూడా అందులో ఉంటాయి. థాంక్ గాడ్, కనీసం నేను వాళ్లకి గుర్తున్నాను. నా పుట్టినరోజు కూడా!

నేను మరణించాక తిరిగి నా ఇరుగు పొరుగు వాళ్లో, దూరపు బంధువులో నా శవసంస్కారం చేస్తారన్న ఆలోచన కలిగే వయసుకి వచ్చేశాను.

నేను పోగొట్టుకున్న జాబితా నాకు రోజూ స్పష్టం అవుతూనే ఉంది. మా అమ్మ తన మనవల్ని చూడకపోవడం, కాకాని గుళ్లో భుజాలమీద ఎత్తుకుని ప్రదక్షిణం చేయకపోవడం, వాళ్లిద్దరి అంత్యక్రియలకు నేను హాజరుకాకపోవడం, నా భార్యపిల్లలు నాతో ఇండియాకి తిరిగి రాకపోవడం, నా మనవలకి నేను కేవలం ఇంట్లో ఫొటోల్లోని ఓ వ్యక్తిగా మాత్రమే గుర్తుండటం ...

మా నాన్నకి నన్ను అమెరికా పంపాలన్న ధ్యేయం లేకపోయి ఉంటే, నా చదువుకి ఖర్చు చేసిన డబ్బుతో సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్ కొని ఉండేవారు. అదిప్పుడు నాదయ్యేది. నేను అమెరికా వెళ్లి ఇన్నేళ్లుగా సాధించిందంతా ఈ రెండు బెడ్‌రూమ్‌ల ఫ్లాట్! ఓ ఎక్స్‌ట్రా బెడ్‌రూమ్! జస్ట్ ట్వెల్వ్ బై ఫిఫ్టీన్ స్క్వేర్ ఫీట్!! దీనికి బదులుగా నేనేం కోల్పోయానో ఆ గది చూస్తూంటే గుర్తుకువచ్చింది.

ఏడుస్తున్న నా దగ్గరకి వచ్చాడు ఓ పన్నెండేళ్ల కుర్రాడు, కిటికీలోంచి పడ్డ క్రికెట్ బాల్‌ని తీసుకోవడానికి.

"ఎందుకేడుస్తున్నారు?" అడిగాడు విస్మయంగా.

"ఈ బెడ్ రూమ్‌ని చూసి. ఈ ఒక్క ఎక్స్‌ట్రా బెడ్‌రూమ్‌నే నాకు మిగిలింది. దీనికోసం నే నెన్ని కోల్పోయానో అని తలుచుకుంటే ...."

వాడు నిశ్శబ్దంగా బయటకు నడిచాడు. చిత్రంగా ఆ రాత్రే వాడి అన్నయ్య హెచ్‌వన్ వీసామీద అమెరికా ప్రయాణం.

(అమెరికా నుంచి నా ఇమెయిల్ ఎడ్రస్‌కి మిత్రులు, అట్లూరి శ్రీనివాస్ పంపిన ఓ ఐటమ్ చదివాక.) □

**గడ్డి తినేవారు**

ఒకసారి నేను మా చిన్నాన్నగారింటికి వెళ్లాను. ఒకరోజు చిన్నాన్న, నేను వీధి అరుగు మీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాము. ఇంతలో ఒక ముసలివాడు పచ్చగడ్డి మోపు అమ్మకానికి తెచ్చి, "బాబూ! గడ్డి కావాలా?" అనడి గాడు. చిన్నాన్న, "ఇక్కడ గడ్డి తినేవారు లేరయ్యా" అన్నాడు. ఆ తాత అమాయకంగా "మీరే అలా సెలవిస్తే ఎట్టా బాబయ్యా" అన్నాడు. చిన్నాన్న మొహం చూచి నాకు నవ్వాగలేదు.

-ఎన్.సి. సీతాదేవి, ఆత్రేయపురం